క్లుప్తంగా

12 నుంచి కాశిరెడ్డినాయన ఆరాధన

సిద్దవటం : మండలంలోని శివునినల్లె గ్రామానికి ఎదురుగా వెలసిన కాశిరెడ్డి నాయన ఆరాధన ఉత్సవాలు ఈ నెల 12వతేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. 12న కాశిరెడ్డి నాయన స్వామికి పూజలు జరిపి అశ్వర్థ నారాయణస్వామికి కళ్యాణం నిర్వహించనున్నారు. 25న అభిషేకం, అలంకరణ, అర్చన చేస్తారు. అనంతరం చెక్కభజన, కోలాటం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉంటాయి. మూడు గంటలకు వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. వరుస విజేత ఎద్దుల యజమానులకు రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు ఇస్తామని నిర్వాహకులు తెలిపారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడమే లక్ష్యం



ఏఎస్పీకి బొకె అందజేస్తున్న క్రీడాకారులు

రాజంపేట టౌన్ : అంతర్జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడమే లక్ష్యంగా ఆడాలని ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే కోరారు. వాలీబాల్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులు శనివారం మర్యాద పూర్వకంగా ఏఎస్పీని కలిసి సత్కరించారు. ఏఎస్పీ మాట్లాడుతూ మంచి ఆట తీరుతో రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్ఠతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. తాను వాలీబాల్ క్రీడాకారుడినేనని, ఎలాంటి సహాయ, సహకారాలైనా అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.షామీర్‌బాషా, కరీముల్లా పాల్గొన్నారు.

ఢిల్లీలో విజయంతో బీజేపీ సంబరాలు



మిఠాయిలు పంచుకొంటున్న నాయకులు

రాయచోటి టౌన్: ఢిల్లీలో బీజేపీ విజయంతో రాయచోటి నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. స్థానిక నేతాజీ సర్కిల్ వద్ద ప్రధాన మంత్రి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి మిఠాయిలు పంచుకున్నారు. బీజేపీ సీనియర్ నాయకులు అరమాటి శివగంగిరెడ్డి మాట్లాడుతూ భారతదేశం మొత్తం మోదీ నాయకత్వం కోరుకుంటోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, నాగార్జున, వెంకట్రామరాజు, డాన్ శ్రీను, రామ శ్రీనివాసరాయల్ , నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పుల్లంపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

పుల్లంపేట: పుల్లంపేటలోని ఎస్‌బీవీడీ సభా ప్రాంగణంలో ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ముక్కా సాయివికాష్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి అరవింద కంటి ఆసుపత్రి వారిచే నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్యమాంబ గుడిలో సీసీకెమేరాలు దగ్ధం



గ్రామస్థులను విచారిస్తున్న ఎస్‌ఐ

వీరబల్లి: మండలంలోని దిగువరాచపల్లి పంచాయతీలో వెలసిన అతి పురాతన ఆర్యమాంబ గుడిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సీసీకెమేరాలు, వైర్లు, మైక్ సెట్ పూర్తిగా దగ్ధమైనట్లు గ్రామస్థులు తెలిపారు. స్థానిక ఎస్‌ఐ మోహన్ నాయక్ దృష్టికి ఆలయ కమిటీ సభ్యులు తీసుకెళ్లగా, ఆయన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులను గుడి పూజారిని విచారించారు.

మెరిట్ టెస్ట్‌లో ప్రతిభ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఎస్.బావాజాన్ రాష్ట్ర స్థాయిలో జరిగిన ఎడ్యుకేషనల్ ఏపీహని మెరిట్ టెస్ట్ (ఈఈఎంటీ)లో ప్రథమ స్థానం సాధించాడు. శనివారం ఈవిషయమై హెచ్ఎం మల్లయ్య మాట్లాడుతూ సైన్స్ టీచర్ శ్రీపతి ప్రోత్సాహంతో విద్యార్థి బావాజాన్ గత ఏడాది డిసెంబర్‌లో ఆన్‌లైన్‌లో ఈఈఎంటీ ప్రిలిమ్స్ టెస్ట్‌లో ఎంపికై ఈ ఏడాది జనవరి 19న మెయిన్స్ పరీక్ష రాసాడన్నారు. ఈ నేపథ్యంలో వెలువడిన ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా కేవలం ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఎంపిక అయ్యారు. ఇందులో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉందన్నారు. సదరు విద్యార్థి శనివారం తండ్రి చాంద్‌బాషాతో కలసి మంగళగిరిలోని సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెమెంటోతో పాటు రూ.8 వేల నగదు రివార్డు అందుకున్నట్లు పాఠశాల క్లస్టర్ సీఆర్‌పీ నాగరాజు తెలిపారు.

ఏరులై పారుతున్న మద్యం

కూటమి నాయకుల అండతో కొందరు మద్యం దుకాణాల యజమానులు అధికారులపై ఒత్తిడి తెస్తూ బెల్టు దుకాణాలను నిర్వహిస్తున్నారు. చట్టంలో లొసుగులను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ దుకాణాలు ఏర్పాటు చేసుకోవడమేగాక ఎక్కడబడితే అక్కడ మద్యం అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు. అరికట్టాల్సిన అధికారులు చేతులెత్తేయడంతో దుకాణదారులకు బెల్టు షాపుల నిర్వహణ ఇష్టారాజ్యంగా మారింది.

- మినీ బార్లను తలపిస్తున్న మద్యం దుకాణాలు
- విచ్చలవిడిగా బెల్టు షాపుల్లో విక్రయాలు



దుకాణానికి దూరంగా ఏర్పాటు చేసిన మినీ బార్

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు ఎక్సైజ్ శాఖ పరిధిలోని రైల్వే కోడూరులో 11, ఓబులవారిపల్లిలో 4, చిట్వేలిలో 4, రాజంపేట ఎక్సైజ్ శాఖ పరిధిలోని పుల్లంపేటలో 3, పెనగలూరు మండలాల్లో 3 ప్రైవేట్ మద్యం దుకాణాలున్నాయి. నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కువ ధరలకు విక్రయించేందుకు వీరే బెల్ట్ షాపులు ఏర్పాటుచేయించారు. మండల, పంచాయితీ, గ్రామాలలో కమీషన్ ప్రతిపాదికన ఈ వ్యవహారం కొనసాగుతోంది. పెనగలూరు, చిట్వేలి, పుల్లంపేట, ఓబులవారిపల్లిలో అధికంగా ఈ బెల్టు షాపులు వెలిశాయి. కూటమి నాయకులకు భయపడి పోలీసులకు సమాచారం అందించేందుకు గ్రామస్థులు భయపడుతున్నారు.

మద్యం బాబుల రచ్చ

బెల్టు షాపులు నడవడంతో అల్లర్లు, అసాంఘిక కార్యకలాపాలు పెరిగాయి. రాత్రి మద్యం మత్తులో అల్లరి మూకలు, రచ్చ రచ్చ చేస్తున్నారు. ఇదేమంటున్న వారిపై దాడులకు పాల్పడుతున్నారు. దుకాణం వద్ద మినీ బార్లు తలపించే ఈ బెల్టు దుకాణాలు ఉండడమే ఇందుకు కారణం. ప్రైవేటు మద్యం వ్యాపారులు మద్యం దుకాణదారులు కలిసి ఒక్కో బాటిల్‌పై రూ.5, రూ.10 పెంచి విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

మహిళలు ఇబ్బందిపడకుండా చూడాలి



పట్టణం, గ్రామాల సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో మహిళలు ఇబ్బందిపడుతున్నారు. దానికి తోడు బెల్టు షాపులు ఎక్కడబడితే అక్కడ ఏర్పాటుచేయడంతో నిత్యం ఏదో సంఘటన జరుగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బెల్టు షాపులపై నిషేధం విధించడంతో సమస్య లేదు. ఇపుడు మద్యం ఏరులై పారుతోంది.

– లక్ష్మినారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు, రైల్వేకోడూరు

అక్రమ విక్రయాలపై చర్యలు తీసుకుంటాం



అక్రమంగా బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో ముమ్మరంగా దాడులు చేయించి ఇటీవల 13 మందిని అరెస్టు చేశాం. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించడం నేరం. నిందితులపై కఠినంగా వ్యవహరిఆస్తం. నిబంధనలకు లోబడి దుకాణాలు నిర్వహించాలి.

– టి.తులసి, సీఐ, ఎక్సైంజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ, రైల్వేకోడూరు

నివాసాల వద్ద మద్యం దుకాణం వద్దు



జనావాసాలకు సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు తొలగించాలి. వీటితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారు. పిల్లలు, మహిళలకు ఇది సమస్యగా మారింది. ఎక్కడబడితే అక్కడ లేకుండా బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలి.

– గుండ్లూరు ఈశ్వరయ్య, స్థానికుడు, పెనగలూరు మండలం

బెల్టు షాపులు తొలగించకుంటే ఆందోళన



గ్రామాలలో బెల్టు షాపులు తొలగించకుంటే ఆందోళన చేస్తాం. ప్రైవేటు మద్యం దుకాణాలు ఊరికి దూరంగా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. నిబంధనల్లో లొసుగు ఆసరాగా తీసుకుని దుకాణాలు ఇష్టానుసారం ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నివారించడంలో ప్రభుత్వం విఫలమైంది.

– దార్ల రాజశేఖర్, ఏఐవైఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

మదనపల్లె సిటీ : మదనపల్లెలో శనివారం జవహర్ నవోదయ విద్యాలయంలో 9వతరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు సెంటర్లు, వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్ పర్యవేక్షించారు.

సూర్యప్రభ వాహనంపై వేంకటరమణుడు



వేంకటరమణస్వామి

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఆరు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం టీటీడీ ఆగమ సలహాదారు శ్రీనివాసచార్యులు, అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, రమేష్‌బాబు, ధనుష్,క్రిష్ణమూర్తిలు స్వామి పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. ఉదయం సూర్యప్రభ,రాత్రి చంద్రప్రభ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. టీటీడీ ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో హరికథ, కళాకారులుచే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈఓ గోపినాథ్, ఇన్స్‌పెక్టర్ ధుష్యంత్‌కుమార్, సిబ్బంది నగేష్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

దేవాలయాలు.. ఆధ్యాత్మికతకు ప్రతీకలు

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్: దేవాలయాల నిర్మాణాలు ఆధ్యాత్మికతకు ప్రతీకలుగా నిలిచాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్ రెడ్డి అన్నారు. మండలంలోని శంకరాపురం గ్రామంలో మేడా కుటుంబీకులు నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో శనివారం సీతా, శ్రీరామ, అంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ వేడుకగా నిర్వహించారు. ఉదయం నుంచి నిర్వహించిన ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆకేపాటికి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఆకేపాటి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఆలయాల నిర్మాణం చేపట్టడం పుణ్యఫలమని అన్నారు. ఈ వేడుకల్లో మేడా సుబ్బారెడ్డి, మేడా మనోహరరెడ్డి, మేడా చక్రధరశేఖరరెడ్డి, మేడా నరసారెడ్డి, మేడా దుర్గారెడ్డిలతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు అరిగెల సౌమిత్రి, గుండు మల్లికార్జునరెడ్డి, గంగా కళ్యాణ్‌కుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పునఃప్రతిష్ట



కన్యకా పరమేశ్వరి అమ్మవారి చిత్రపటం ఊరేగిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

రాయచోటి టౌన్: రాయచోటి పట్టణంలోని గాంధీ బజారులో నూతనంగా పునరుద్ధరించిన ఆలయంలో కన్యకా పరమేశ్వరీదేవి పునఃప్రతిష్ట పూజలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారిశాలలో హోమాలు, ఇతర పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి చిత్రపటంతో ఆర్య వైశ్యులు గాంధీ బజార్, కంసల వీధి, బ్రాహ్మణ వీధి, బాలికోన్నత పాఠశాల వీధులు, కొత్తపేట రామాపురం వీధుల గుండా ఊరేగించి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో గోపూజ, పునఃప్రతిష్ట, కుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్యవైశ్య సంఘం నాయకులు, అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట

రామాపురం: మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయితీ కడవకూటివాండ్లపల్లె సమీపంలో వెలసిన శివాలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి ధ్వజ స్తంభం, పార్వతి మూలవరుల విగ్రహాల ప్రతిష్ట శిఖర ప్రతిష్ట పూజలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి రాధాకృష్ణ, విజయలక్ష్మి, శివశంకర్, ఇందిరా, జనార్దన్, బాలు, లత, శ్రీనివాసులు, లక్ష్మీకళ హాజరై శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండే మహా గణపతి పూజ, పుణ్యావాచకం, గంగా మాత పూజ, కలశ పూజ, యంత్ర పూజ, మహా మంగళ హారతి, అనంతరం పాటకచేరి, సాయంత్రం అగ్ని ప్రతిష్ట, అగ్ని దీక్ష, హోమాలు, మూల మంత్రం, మంత్ర జపాలు, జల నివాసం, మంగళహారతి, ఆలయం వద్ద వచ్చిన భక్తులందరికీ వెంకటసుబ్బయ్య అన్నదానం నిర్వహించారు. రాత్రికి రవి భజన బృందం భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా భీష్మ ఏకాదశి ఉత్సవం



ఉత్సవ మూర్తులు

ఒంటిమిట్ట: ఏకశిలానగరి ఒంటిమిట్టలోని కోదండపాణి కోవెలలో శనివారం భీష్మ ఏకాదశి వేడుక ఘనంగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణ సమేత మూలవరులను పంచామృతంతో అభిషేకించి నూతన పట్టు వస్త్రాలు, పుష్పమాలలు, ఆభరణాలతో అలంకరించారు. విష్ణు సహస్త్ర నామార్చన, ఆదిత్యహృదయం, స్త్రీసూక్తం, పురుష సూక్తం, హనుమాన్ చాలీసా పారాయణంతో వేదోక్తంగా పూజలు జరిపారు. అనంతరం సీతా రామ లక్ష్మణ సమేత ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఒంటిమిట్ట పుర వీధులలో వైభవంగా ఊరేగించారు. గ్రామోత్సవంలో స్వామి వారికి కాయా కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల రికార్డులు తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న జేసీ ఆదర్శరాజేంద్రన్

గుర్రంకొండ: మండలానికి చెందిన ఫ్రీహోల్డ్ భూములకు చెందిన రెవెన్యూ రికార్డులను జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ తనిఖీ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా మండలంలో ఏఏ గ్రామాల్లో ఎంత మేరకు ఫ్రీహోల్డ్ భూములు ఉన్నాయో ఆరా తీశారు. సదరు భూముల పరిస్థితి, వాటి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే కార్యక్రమం పురోగతిపై సమీక్షించారు. ఇప్పటివరకు ఎంత శాతం మేరకు రీసర్వే పనులు పూర్తి చేశారో వివరాలు అడిగి తెలుసుకొన్నారు. గత నెలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు, రైతుల నుంచి సమస్యలపై ఆరా తీశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యల్ని ఎంతమేరకు పరిష్కరించారు.. ఎన్ని అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ బాబ్‌జాన్, ఆర్ఐ శశికళ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రాక్టికల్ పరీక్షలకు ఆశాలకు డ్యూటీ దుర్మార్గం

మదనపల్లె : ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాల వద్ద ఆశా కార్యకర్తలకు డ్యూటీ వెయ్యడం దుర్మార్గం అని, వెంటనే రద్దు చెయ్యాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షల సందర్భంగా ఆ కేంద్రాల వద్ద వైద్య, ఆరోగ్య సిబ్బంది ని ఏర్పాటు చెయ్యడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. విద్యార్థులు ఏదైనా అసౌకర్యానికి గురైనా, అనారోగ్య సమస్యలు వచ్చినా పరీక్షించి, ప్రథమ చికిత్స అందించడానికి కృషి చెయ్యాల్సిన వైద్యాధికారులు వైద్యం పట్ల ఏ మాత్రం అవగాహన లేని ఆశాలకు విధుల్లో పెట్టడం అంటే విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడటమే అన్నారు. అధికారులు స్పందించి పరీక్ష కేంద్రాల వద్ద ఆశాలకు వేసిన డ్యూటీలను రద్దు చెయ్యాలనిఏఎన్ఎంలకు బాధ్యత అప్పగించాలని డిమాండ్ చేశారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన రామసుబ్బయ్య

సిద్దవటం : సిద్దవటం శివారున జరిగిన రోడ్డు ప్రమాదంలో చలపాటి రామసుబ్బయ్యకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. సిద్దవటం ఆకుల వీధికి చెందిన చలపాటి రామసుబ్బయ్య పొలం పనులు ముగించుకొని ఇంటికి బయలుదేరారు. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం జిలకుంట గ్రామస్తులు బెంగళూరు నుంచి కారులో స్వగ్రామానికి వెళ్తున్నారు. సిద్దవటం శివారున వీరి కారు రామసుబ్బయ్యను ఢీకొనడంతో గాయాలయ్యాయి. 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని ఇద్దరికి..

పుల్లంపేట: కడప–చెన్నై జాతీయ రహదారిలోని పుల్లంపేట వంతెన వద్ద శనివారం లారీ, స్కూటర్ ఢీకొన్న సంఘటనలో స్కూటర్‌పై వెళ్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. రామక్కపల్లి గ్రామానికి చెందిన రాజయ్య, పెంచలయ్య పుల్లంపేట నుంచి రామక్కపల్లి గ్రామానికి మధ్యాహ్నం 11 గంటలకు బయలుదేరారు. పుల్లంగేరు వంతెన వద్దకు రాగానే వెనుక వస్తున్న లారీ ఢీకొంది. దీంతో పెంచలయ్యకు స్వల్ప గాయాలు కాగా, రాజయ్యకు తీవ్ర గాయాలవడంతో మెరుగైన చికిత్సకోసం తిరుపతికి తరలించారు. సంఘటనా స్థలంలో ఎవరూ లేకపోవడంతో లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. 108 ద్వారా స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పుల్లంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

వీరబల్లి: మండలంలోని సానిపాయి వంటిల్లు సమీపంలోని ఓ దుకాణంలో 16, మండల కేంద్రంలోని మరో షాప్‌లో ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి మద్యం విక్రయదారులపై కేసు నమోదు చేశారు.

ఎంపీపీ పరామర్శ

వీరబల్లి: మండలంలోని మాదిరెడ్డిగారిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు కసిరెడ్డి శ్రీరాములురెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్నారు. ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, శ్రీరాములురెడ్డి, మల్లు రామ్మోహన్‌రెడ్డి, పెంచలయ్య, నరసింహులు తదితరులు శనివారం ఆయనను పరామర్శించి ఆరోగ్య వివరాలపై ఆరా తీశారు.

టీబీ విభాగం పరిశీలన

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఉన్న జీజీహెచ్ పరిధిలోని టీబీ విభాగాన్ని శనివారం మదనపల్లి డివిజన్ టీబీ అధికారి డాక్టర్ శ్రీధర్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ టీబీ డాట్ సెంటర్, గళ్ళ పరీక్షలు విభాగాల నిర్వహణను పరిశీలించారు. టీబీ యూనిట్ పరిధిలో మందులు వాడుతున్న వారి వివరాలు , గళ్ల పరీక్ష చేసుకొన్న వారి వివరాలను నమోదు చేసిన రికార్డులను చూశారు. టీబీ విభాగ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

చిన్నమండెం : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వెనుక వైపున జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు దాడులు చేసి జూదమాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుండి రూ.60,500 నగదు స్వాధీనపరచుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ఆయాపై విచారణ చేపడతాం



బాలుడు గౌతమ్ కుటుంబీకులను పరామర్శిస్తున్న అంగన్ వాడీ అధికారులు

చిట్వేలి : నేతివారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గాయపడిన బాలుడు నలగల గౌతమ్ ఘటనపై విచారణ జరిపామని సూపర్ వైజర్ వసుంధరమ్మ తెలిపారు. ఆయమ్మ తోసింది...బాలుడికి ఎముక విరిగింది శీర్షికన ప్రచురించిన వార్తకు వారు స్పందించి బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1000 అందజేశారు. సూపర్ వైజర్ వసుంధరమ్మ మాట్లాడుతూ ఆయా తోయడం వల్ల బాలుడికి గాయమైందనే విషయం వాస్తవం కాదని, విద్యార్థులు, అంగన్‌వాడీ బాలలు ఆడుకుంటుండగా కింద పడ్డాడని తన విచారణలో వెల్లడైందన్నారు. ఆయా నోటి దురుసుతనంతో ఇదంతా జరిగిందన్నారు. సెలవుపై ఉన్న సీడీపీఓ నిర్మలా జ్యోతి ఫోన్ ద్వారా తన కుటుంబ సభ్యులతో మాట్లాడి బాలుడిని పరామర్శించారు. ఈ సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని పేర్కొన్నారు. సుధామణి, శ్రీలక్ష్మీ అన్నారు.

నేడు ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు



రాజంపేట పట్టణంలోని అమ్మవారిశాల

రాజంపేట టౌన్ : రాజంపేటలో ఏటా దసరా ఉత్సవాలు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడి నేతృత్వంలో ఘనంగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆ సంఘం అధ్యక్ష పదవికి గట్టి పోటీ ఏర్పడింది. ఈ ఏడాది సంఘం ఎన్నికలు జరుగుతుండడంతో అధ్యక్షుడుగా ఎవరు ఎంపికవుతారోననే ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు ఎన్నికలు జరిపి సాయంత్రం 6 గంటల తర్వాత ఫలితాలను వెల్లడించనున్నారు. అధ్యక్ష పదవి కోసం గ్రంథే సత్యనారాయణగుప్త, అన్నం సుబ్బరాయుడు, ప్రకాష్ రావు గట్టిగా పోటీపడుతున్నారు. ఈ ఎన్నికలను అందరు అభ్యర్థులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని గెలిచే ప్రయత్నం చేశారు. కొందరు అభ్యర్థులు డబ్బు ఎర చూపడంతో.. ఆర్యవైశ్య పెద్దలు ఆవేదన చెందినట్లు సమాచారం. ప్రజల్లో చులకన భావనం ఏర్పడుతుందని.. వెంటనే చెక్ పెట్టాలని చెప్పినట్లు తెలిసింది.

24న తాడేపల్లి వద్ద ఉపాధి కూలీల ధర్నా



మాట్లాడుతున్న బీకేఎంయూ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : ఈ నెల 24వ తేదీన ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించుకనేందుకు తాడేపల్లి గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు బీకేఎంయూ రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరామయ్య కోరారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న గ్రామీణాభివృద్ధి సమస్యల పరిష్కారం, జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కూలీలకు జాబ్ కార్డుల ఏర్పాటు, నిత్యావసర సరకుల ధరలకు అనుగుణంగా రోజు కూలీ రూ,700, ఏడాదికి 365 రోజుల పనిదినాలు కల్పించాలని, సమ్మర్‌లో మజ్జిగతోపాటు, అలవెన్సు ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ. 20 లక్షల పరిహారం ఇవ్వాలనే డిమాండ్లపై చర్చ ఉంటుందన్నారు. ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లిక రమణయ్య, కె.వెంకటరమణ, కటారి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి



మాట్లాడుతున్న ఏడీ సుధాకరరెడ్డి

రాయచోటి అర్బన్: విద్యార్థులు చదువుతోపాటు సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సాయి ఇంజినీరింగ్ కళాశాల ఏడీ సుధాకర్‌రెడ్డి కోరారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ నూతన కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులు యోగ, మెడిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, అంకితభావంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. తోటి వారికి తమవంతు సహాయమందిస్తూ వివిధ సామాజిక కార్యక్రమాల్లోనూ, రక్తదానం, మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు. ప్రిన్సిపల్ బాలాజి, రెడ్డెయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛా కాల్వ ప్రవాహానికి ఆటంకం కల్గించవద్దు



పింఛా కాల్వను పరిశీలిస్తున్న ఏఈఈ నాగేంద్ర

సుండుపల్లె: పింఛా ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువలలో ప్రవహించే నీటికి ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని జల వనరులశాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.నాగేంద్రనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు చాలా వరకూ వరినాట్లు వేసుకున్నారని, చివరి ఆయకట్టు వరకు ఉన్న రైతులందరికీ నీరందేలా అందరూ సహకరించాలన్నారు. కుడి కాలువను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కుడి కాలువలో పారే నీటికి కొన్ని చోట్ల అడ్డుకట్ట వేసి పిల్ల కాలువలకు నీటిని మళ్లిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తూముల ద్వారా కాకుండా మోటర్లు, అనుమతి లేని తూములు ఏర్పాటు చేసుకొని అటంకం కల్గిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

వేర్వేరు ప్రాంతాలలో 75 మద్యం బాటిళ్లు సీజ్

సుండుపల్లె : మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు శనివారం దాడులు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తుల నుంచి అక్రమంగా తరలిస్తున్న 75 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు. స్థానిక బైరాగుట్ట ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద ఇద్దరు అనుమానాస్పదంగా కనబడడంతో తనిఖీ చేసినట్లు తెలిపారు. చీనేవాండ్లపల్లికి చెందిన బాడేపల్లి కొండారెడ్డి వద్ద 25, వావిళ్ల వడ్డుబిడికి గ్రామానికి చెందిన పసుపులేటి రెడ్డయ్య వద్ద 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ వద్ద చాకల పల్లెకు చెందిన బండి నారాయణ వద్ద 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న 75 మద్యం బాటిళ్లను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.